

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

- భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**సీత... ద గ్రేట్ లెర్నర్**

"అదికాదండీ.." అయిదునిముషాల తరవాత నోరు పెకల్చుకుని అన్నది మా అమ్మ.

"నోరు తెరవకు.. ఏవన్నావ్? వెధవ పనులు చెయ్యడంగాక ఏమీ ఎరగనట్టు మాట్లాడుతోందా? నువ్వనేమాటకి అర్థం నీకైనా తెలుసా? అయినా అదేం చేసింది? అది దాని స్నేహితులతో కలిసి చదువుకుంటున్నమాట వాస్తవం. నీ గుడ్డి మనసుకి తెలియకపోయినా నాకు తెలుసు. ఎవరన్నా మన పిల్లని తక్కువచేసి మాట్లాడితే వాళ్ళని చెప్పుతో కొట్టాల్సిందిపోయి, ఊళ్ళోవాళ్ళ మాటలు విని మన పిల్లనే అనుమానిస్తావా?" నాన్న గొంతులో ఏమాత్రం కోపం తగ్గలేదు.

అవ్వాళ రాత్రి పొద్దుబోయేదాకా ఇల్లంతా మౌనం నాట్యం చేసింది. నాన్న భోజనం చేశాక మెల్లగా దగ్గరికెళ్ళి, "నాన్నా.. నిజంగా నేను చేసిన తప్పేమిటో నాకు తెలీదు. కానీ, కుర్రాళ్ళతో కలిసి తోటల్లో తిరగడం, అది చదవడానికైనా సరే, తప్పని కొంత అర్థమయింది. పాపం అమ్మ ఎవరి మాటలో విని గోలచేసింది కానీ, నేనంటే ప్రేమలేక కాదుగా! ఇకనుంచీ, నువ్వొప్పుకుంటే, వాళ్ళందర్నీ మనింటికే పిలిచి, ఇక్కడే చదువుకుంటా. ఎందుకంటే, ఒకటికి పదిసార్లు విన్నది మననం చేసుకోవడం మాకందరికీ ఆరోతరగతినించే అలవాటయింది!" అన్నాను.

మా నాన్నలేచి, నా తల నిమిరి, "అలాగే తల్లీ.. నాకు తెలుసు.. నువ్వెప్పుడూ మంచి పిల్లవే!" అని వరండాలోకి వెళ్ళాడు.

మా అమ్మ మౌనంగా ఓ మూల కూర్చుని వుంది.

"లే..! పసిపిల్లని పట్టుకుని నానా మాటలు అనడమేకాక నామీద అలకలెందుకూ? చూడు భాగ్యం, సీతని యీలోకంలోకి తీసుకొచ్చింది మనం. ఇరుగింటివాళ్ళూ పొరుగింటివాళ్ళూ కాదు. మన పిల్లని మనమే అర్థం చేసుకోకపోతే, ఎవరు అర్థం చేసుకుంటారూ? లే ఇంకెప్పుడూ విషయం తెలీకుండా దానిమీద నోరు చేసుకోకు" అన్నాడు. ఏ కళనుందోగానీ మరి అమ్మ లేచింది.

తుఫాను ఎంత చిన్నదయినా పెద్దదయినా అది తుఫానే. దాని తాలూకు గుర్తులు కొంతకాలం మిగిలే ఉంటాయి. ఓ వారం రోజులు ఇబ్బంది ఇబ్బందిగా గడిచినా, తరవాత మళ్ళీ మామూలయింది. ఒకటి మాత్రం అర్థమైంది, మా నాన్న కోపాన్ని చూశాక మాత్రం మా అమ్మ నోటిని చాలా అదుపులో వుంచుకోవడం నేను గమనించాను. 'కోపం' కూడా 'దానిపని అది చేసుకుంటూ పోతుందని' బాగా అర్థమయింది. నా ఫ్రెండ్సందరికీ విషయం చెప్పి, కంబైన్డ్ స్టడీకి మా ఇంటికే ఆహ్వానించాను. దాంతో ఫ్రెండ్స్ దృష్టిలో 'నా లెవెల్' పెరగడమే కాక, బజారు పనుల బాధ తప్పింది. కారణం వాళ్ళంతా మా అమ్మకి అలవాటయిపోవడమే.

"ఏదోనే సీతా ఆ పిల్లలందరూ బుద్ధిమంతులేకాదు, మగపిల్లలు లేని కొరతకూడా తీరుస్తున్నారనుకో" అన్నది మరి అమ్మ. అంతేకాదు అదివరకులా పీనాసితనంగాకాక వాళ్ళకి చిరుతిళ్ళు బాగానే పెడుతోంది. ఆఖరికి మా 'మోతీ'కి కూడా వాళ్ళంతా నచ్చేశారు.

పరీక్షలు ఓ విధంగా కాలం చేసే హెచ్చరికల్లాంటివి. 'సమయం' ఎంత విలువైనదో పరీక్షలు మనకి చెబుతాయి. కృష్ణారావు మాస్టారి మాటలు నాకు గుర్తున్నాయి.

ఎంత గుర్తున్నా కొన్ని వీక్‌నెస్‌స్ తప్పవు. నవలలు చదవడం నా బలహీనత. జాక్ లండన్ వ్రాసిన 'ప్రకృతి పిలుపు' అనే పుస్తకాన్ని అయిదుసార్లు చదివాను. అది బక్ అనే ఓ కుక్క ఆత్మకథ. ఓ కుక్క మనసులోకి దూరి దాని ఆలోచనలనన్నీ అద్భుతంగా అక్షరాల్లో ఇమడ్చడం సామాన్యమైనది కాదు. అదేమి శైలి.! అదేమి రాత! నేను చదవడమేకాదు మా నాన్నకి ఇచ్చి చదవమన్నాను. ఆ తరవాత జ్యూల్స్‌వెర్న్ రాసిన "సముద్ర గర్భంలో సాహసయాత్ర" దాన్నీ మూడోసారి చదివేసి నాన్నకి ఇచ్చాను.

"తా చెడ్డకోతి వనమెల్లా చెరిచినట్టు, నువ్వు చదవడమే కాదు.. మీ నాన్నని కూడా చెడగొట్టు." మా నాన్న వినాలనే గట్టిగా అన్నది మా అమ్మ.

"ఆ మాట అనకపోతే నువ్వూ చదవొచ్చుగా.. కేవలం పత్రికలే కాదు.. నవలలూ అద్భుతమైనవే!" అన్నాడు నాన్న. అప్పటికే 'రచయితలు' వెనక్కి తగ్గి 'రచయిత్రులు' విజృంభించారు. అంతెందుకూ, నా క్లాసుమేట్స్ కూడా సెక్రటరీ నవల హీరో 'రాజశేఖరం'లాంటి వాడ్నే పెళ్ళాడాలని కలలు కనేవాళ్ళు. ఆ పుస్తకం మాత్రం (సీరియల్) నేను చదవలేదు. నా ఫ్రెండ్స్ వాగుడంతా నాకు 'పిచ్చి'తనంగా అనిపించేది.

"ఒసేయ్ సీతా.. అతి తొందరలో మనం చచ్చిపోతామే" బేలగా అన్నది పుష్పకుమారి.

"ఎందుకే?" అడిగింది సూర్యకాంతం జాంకాయ తింటూ దాని నోరు మిషన్‌లా పనిచెయ్యాలని చెప్పానుగదా. ఏదో ఒకటి నలుగుతూనే వుండాలి.

"అష్టగ్రహ కూటమి వస్తుందిట. అదీ ఫిబ్రవరిలోనేనే.!" భయంగా అంది పుష్పకుమారి.

"నా బొంద. ఏదీరాదు.." రెండో జాంకాయిని సంచిలోంచి తీస్తూ అన్నది సూర్యకాంతం.

"రాకపోతే సరే.. మరివస్తే?" ఆలోచిస్తూ అన్నది సరస్వతి.

"పోతే అందరూ పోతారుగా!" నిర్భయంగా అన్నది విజయలక్ష్మి. పైకి అది అలా కనపడుతుంది గానీ, పిల్లి అరిచినా అది విజయకి పులిగాండ్రింపే! మాకు తెలీదా, దాని ధైర్యం ఎంతో.

"నువ్వేమంటావే సీతా?" అడిగింది కమల.

"ఇప్పటిదాకా ఐడియా లేదే. అయితే ఆలోచించాలి. అసలు అష్టగ్రహకూటమి అంటే ఏమిటో మాస్టార్ని అడుగుదాం" అన్నాను.

స్కూల్లో ఎక్కడ చూసినా ఇదేగోల. పేపర్లలోనూ ఇదేగోల.

"ఏ గ్రహమైనా శనీశ్వరుడి ఎదుటికి రావడానికి వణికి చస్తుందిగదా. అందుకే నేను శనీశ్వరుడ్ని పూజించి పేద్దమొక్కు మొక్కబోతున్నా." భక్తిగా అన్నది జయలక్ష్మి.

"అవునే..నిజంగా చచ్చిపోతామా.. అయినా, మా నాన్న జేబులోంచి కొట్టేసిన డబ్బులు చాలా ఉన్నయ్యే నాదగ్గర... చచ్చిపోతే ఎట్లా? పోనీ అవన్నీ హుండీలో వేస్తే పుణ్యం వచ్చి చచ్చిపోకుండా వుంటామా?" గుసగుసగా అన్నది రాచేల్. రాచేల్ మా అందర్లోకి చాలా షార్పు. ఏ విషయం బయటపడదు. పొరబాటున 'జేబులోంచి కొట్టెయ్యడం' అన్న విషయాన్ని బయట పెట్టింది. అదీ నా ముందర. అది క్రిస్టియన్. "ఔనే. హుండీలో వేస్తే పుణ్యం వస్తుందనుకో, కానీ అది చాలా టైమ్ పడుతుంది. అదీగాక, మా గుళ్ళల్లో అయితే కనీసం వారానికోసారైనా హుండీ తెరిచి డబ్బులు తీస్తారు. మరి మీ చర్చిలో ఎప్పుడు తీస్తారో నాకు తెలీదు కదా. అయితే, హుండీలో కంటే ముందే పుణ్యం వచ్చే ఉపాయం నాకు తెలుసు!" అన్నాను.

"ఏమిటే అది?" ఆత్రంగా అడిగింది రాచేల్.

"అన్ని దానాలకంటే గొప్పది అన్నదానం అని తెలుసుగదా?" అన్నాను.

"అవునూ..మొన్నా మధ్య ఆంజనేయులి మాస్టారింట్లో కూడా చేశారటగదా" అన్నది.

"యస్. అందుకే నువ్వూ అదే చెయ్యాలి. అన్నదానం అంటే ఓహ్...బోలెడు పని. వంటలు చేయించడం, వడ్డించడం ఇవన్నీ మహా తలనెప్పి పనులు. దానికి బదులుగా.. నీ క్లోజ్ ఫ్రెండ్స్‌ని, అంటే మన సరస్వతినీ, సూర్యకాంతాన్ని, పుష్పకుమారినీ, జయనీ, విజయనీ, నన్నూ గుట్టుగా మన కృష్ణయ్య హోటల్‌కి తీసికెళ్ళి దిట్టంగా టిఫిన్లు సరఫరా చేయించావనుకో. మేం ఇట్టా తినేసిన వెంటనే నీకు పుణ్యం వచ్చేస్తుంది" చాలా సీరియస్ మొహంతో చెప్పాను. లోపల్లోపల చచ్చే నవ్వొస్తోంది. పాపం, రాఛేల్ ఎంత షార్ప్ అయినా, పుణ్యం గురించిన సమాచారం దానికంత తెలీదుకదా!.

నా వాగుడంతా మావాళ్ళందరూ వినివుంటారని తెలుసు. అరుస్తూ ఎన్ని సీక్రెట్లు మాట్లాడినా మాకు చెవికి ఎక్కవు కానీ, కొంచెం దూరంగా వెళ్ళి గుసగుసలాడితే మాత్రం వెంటనే పట్టేస్తాయి, 'స్మెల్లర్స్' బేచ్‌లాగా.

"గ్రేట్ అష్టగ్రహకూటమి రాలేదనుకో..! అప్పుడు నాడబ్బంతా వేస్టేగదా?" షార్ప్‌గా అడిగింది రాఛేల్.

"సపోజ్.. వస్తే? పదిమందికి పంచుటయా? లేక, పాపకూపమున బడి మగ్గుటయా? నువ్వే తేల్చుకు చెప్పు" దానిక్కాస్త టైమిచ్చి ఇవతలికి వచ్చాను. అది ఏ డెసిషన్ తీసుకున్నా, కార్యక్రమం జరిగేది రేపేగా. ప్రస్తుతానికి దాని దగ్గర పైసా కూడా లేదని తెలుసు. కొట్టేసిన డబ్బులు దాస్తాంగానీ జేబుల్లోనో, జామెట్రీ బాక్సుల్లో పెట్టుకుని తిరగంగదా.! అది అందరు పిల్లలకీ తెలిసిందేగదా.

"అష్టగ్రహకూటమి అంటే జలప్రళయం"

"అష్టగ్రహకూటమి వస్తే భూమి ముక్కలు ముక్కలైపోతుందిట!"

"మనుషులు జీవులూ ఎవరూ ఏదీ యీ భూమ్మీద మిగలరుట!"

"ఢిల్లీలోని కోటీశ్వరులందరూ అమెరికాకి ఆస్తులమ్ముకుని వెళ్ళిపోతున్నారట. అష్టగ్రహకూటమినించి తప్పించుకోవటం కోసం"

"రష్యావాళ్ళు మాత్రమే రోదసీలో ఇళ్ళు కట్టుకుని బ్రతుకుతారుట" దేవుడా... రూమర్లే రూమర్లు. ఆఖరికి మా కక్కిరాల పుల్లయ్యగారు కూడా, "పాపగారూ... ఇంకేవుందండీ.. అదేదో వత్తాదిగదంటుండీ.. అందరూ దివాలా తీసేత్తారుటగదుండీ.. కలికాలంగదండీ మరీ.! ఇదిగో, యీ పప్పుండ తీసుకోండి" అని ప్రేమగా ఓ శనగపప్పు ఉండ చేతికిచ్చాడు.

చెప్తే నమ్మరుగానీ, జనాలు శిబిచక్రవర్తులూ, దానకర్ణులూ అయిపోయారు. కొందరైతే 'లాజిక్' ఉపయోగించి సముద్రయానాలకి ప్లాన్ చేసుకుంటే, కొందరేమో కొండమీదున్న దేవుళ్ళదగ్గరికి క్యూ కట్టారు. ఇక మా టీచర్లయితే పిల్లల్ని కొట్టడం తిట్టడం పూర్తిగా మానేశారు. ఆమాటే నేను సరదాగా ఫిఫ్తుఫాం సంధ్యారాణితో అంటుంటే విని, "అంత సంతోషించనక్కర్లా..ఫిబ్రవరి మామూలుగా దాటిపోతే, మామూలుకంటే పదిరెట్లు తినాల్సొస్తుంది" అన్నారు మా ఆంజనేయులు మాస్టారు.

ఇక మా అమ్మయితే పూటకో పూజ. రోజుకో వ్రతం. "అవునే పెదపాడుదానా, యీ పూజలూ వ్రతాలూ అన్నీ మీ వాళ్ళకోసమేనా మా గురించి కూడానా?" అని కాస్త రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా పరమ శాంతమూర్తిలా చిన్న చిరునవ్వు నవ్విందే తప్ప, అంతకిమించిన రియాక్షను ఇవ్వలేదు. మా నాన్న మాత్రం "సీతాలూ, ఇవేవీ నమ్మకు. నమ్మి అసలు బుర్రపాడుచేసుకోకు. నలుగురిలో జరిగేది చావైనా బతుకైనా పండగలాంటిదే హాయిగా చదువుకో" అన్నాడు.., తన లా పుస్తకాల్లో మునిగిపోతూ.

ఏమైనా ఓ నెలనెలంతా రకరకాల వార్తలు. రకరకాల ప్రయత్నాలు (మృత్యువు నించి తప్పించుకోవాలని) రకరకాల పూజలు, వ్రతాలు, ప్రార్థనలు. రాజమండ్రినించి వచ్చిన ఓ సాధువైతే 'నవగ్రహ, అనుగ్రహ తాయెత్తు' అనే మహిమగల తాయిత్తుల్ని తెగ అమ్మి వేలల్లో సంపాదించాడు.

ఆశ్రమానికి వెళ్ళి స్వామీజీనీ రాజమ్మగారినీ అడిగితే ఇద్దరూ చిన్నగా నవ్వి, "అమ్మాయ్.. ఎప్పుడో ఏదో వస్తుందనో, రాబోతోందనో అనుకుని మన కర్తవ్యాన్ని నిర్వహించడం మనం మానకూడదు. వస్తే వస్తుంది. రానీ! రాలేదా.. అందరికీ మంచిదే కదా!" అన్నారు. ఆ మాట నాకు నచ్చింది. ఆ నెల్రోజులూ మరి పాకబడి వాళ్ళు (నేను తప్ప) పుస్తకాలు ముట్టుకోకుండా పండగ చేసుకున్నారని చెప్పక్కర్లేదుకదా! అలా ఓ ముప్పుగాని ముప్పొచ్చి తొలిగిపోయింది.

అష్టగ్రహకూటమి చాలా విచిత్రాల్ని చేసింది. కొంతమంది 'ఎట్టాగూ చచ్చిపోతాం. పోయాక యీ ఆస్తి అంతస్తులు వెంటరావుకదా.. కనుక ఆనందో్బ్రహ్మ" అని నిర్ణయించుకుని పొలంపుట్రా అమ్మేసి జల్సా చేశారు. ఏమీ జరక్కపోయేసరికి లబోదిబోమంటూ రోడ్డున పడ్డారు.

"చూశావా... ఆలోచించి చెయ్యాలి ఏ పని అయినా! అలా ఆలోచించబట్టే నా డబ్బుని సేఫ్‌గా ఉంచుకున్నా" మెరుస్తున్న కళ్ళతో అన్నది రాచేల్.

"పిచ్చిదానా... అక్కడే నువు పొరబడ్డావు. డబ్బు సేఫ్..ఓకే.. కానీ పుణ్యం హుష్ కాకీ అయిపోయింది. ఎంతమంది భక్తులు నవగ్రహపూజలు చేస్తే యీ ముప్పు తొలిగిందో నీకేం తెలుసూ? ఆ పుణ్యమే మనని రక్షించింది. బోలెడు పుణ్యం వచ్చే ఓ అపురూపమైన ఛాన్సుని నువ్వుపోదులుకున్నావు. ఇప్పుడు నువ్వు పదిరెట్లు ఖర్చుచేస్తానన్నా ఈ సీత వస్తుందా?" తలెగరేసి అన్నాను. కిందపడ్డా మనమాటే పైనుండాలనేది ఎవరూ నేర్పక్కర్లా! రాచేల్ మొహం పోపు మాడినట్టు మాడిపోయింది.

(ఈ 'అష్టగ్రహకూటమి' వ్యవహారం జరిగింది 1962లో. అప్పటి విషయాల్ని యధాతధంగా రాశాను. ఇప్పటివాళ్ళకి ఇది విచిత్రంగా ఉండొచ్చు. కొంచెం జ్ఞాపకం తెచ్చుకుంటే, 'స్కైలాబ్' విషయం గుర్తుందా? లేకపోతే ఫరవాలేదు.. దాన్నీ రాస్తాను. ఈ సీత యదార్థాలే రాస్తుందికానీ ఏదీ కల్పించి వ్రాయదు... ఇట్లు: మూడో సీత)

మా ముత్యాలోడు తప్ప అందరం పాసయ్యాం. "నా చదువు అయిపోయిందే సీతా.. ఛస్తే మా నాన్న చదివించడు. వ్యవసాయమే గతి" అని నా దగ్గర వాపోయాడు ముత్యాలోడు. వాడి కళ్ళనిండా నీళ్ళే. నా నోట మాట రాలేదు. "ఎన్నాళ్ళు నీ కేరేజీ నాకిచ్చావో.!" వెళ్తూ వెళ్తూ వెనక్కి తిరిగి అన్నాడు. (థాంక్స్ చెప్పటం లాంటివి ఎంత వ్యర్థమో ఇప్పుడు తెలుస్తోంది.) ఓ పక్క స్కూల్‌కి శలవలు.. మరో పక్క కోర్టుకి శలవలు. మా అమ్మగారి సతాయింపు ప్రారంభమైంది. ఏమిటీ విశేషం అంటే ఏలూరు వెళ్ళాలని. వెళ్ళటం వరకు కాదు, పదిరోజులు వుండాలిట. మా నాన్నకి అసలే బోలెడంత బిడియం. ఆయన ఎక్కడా ఫ్రీగా ఉండలేరు. ఆ విషయం నాకు తెలుసు. కానీ మా అమ్మకి అర్థమైతేగదా! ఆవిడ ఏమనుకుంటుందంటే, వాళ్ళవాళ్ళనందర్నీ తన చిన్నప్పుడు వుండేవాళ్ళలాగే వూహిస్తోంది గానీ, అక్కడి మార్పులు గమనించట్లేదు. ఇంటి పెద్ద ఇంటి పెద్దే కానీ ఆ పదవి చేతులూ కాళ్ళూ ఆడేంతసేపే. వాటి జవసత్వాలు తగ్గినపుడు, పెద్దరికం కూడా పంథా మార్చుకుంటుంది.

"నువ్వెన్నన్నా చెప్పు. నిన్ను మీ ఇంట్లో దింపి ఒక్కరోజు మాత్రం వుంటా. ఆ తరవాత నేను ఇంటికొచ్చేస్తా" నిష్కర్షగా అన్నాడు మా నాన్న. మూతి మూడు వంకర్లు తిప్పి, "మరి మీ కూతురేమంటుందో!" అన్నది మా అమ్మ.

"నేనూ నాన్నతో వచ్చి, నాన్నతోనే వెనక్కొస్తాను" అన్నా. ఆ రాత్రంతా రచ్చే. పంతం కొద్దీ ప్రయాణం పెట్టుకుంది మా అమ్మ. మా ఇద్దరికీ వినిపించేట్టు, "హూ...నా యింటికి నేను వెళ్ళడానికి తోడు కావాలా? అందరూ మధ్యలో వచ్చిన వాళ్ళే. అయినా, అసలు ఏ కూతురైనా తల్లీదండ్రీ దగ్గర వుండాలని కోరుకోదా? హూ..!" అంటూ సణిగింది.

"అందుకేనే మా లక్ష్మి కూతురా.. నువ్వు మీ అమ్మానాన్న దగ్గరికి పో.. నేను మా నాన్న దగ్గరుండి జాగ్రత్తగా చూసుకుంటా!" అన్నాను. మొత్తానికి ఆ అర్ధరాత్రిలో సద్దుమణిగింది.

ఇప్పుడయితే అన్ని కూరగాయలూ అన్ని కాలాల్లోనూ దొరుకుతున్నైగానీ, అప్పుడు దొరికేవికాదు. ఏ సీజన్‌లో పండేది అప్పుడు మాత్రమే. అయితే మన పూర్వీకులు మహా మేధావులు. అందుకే 'ఒరుగు'ని తీసి, దాన్ని కాస్త నీళ్ళల్లో నాననిచ్చి, పప్పుసగం వుడికాక అందులో పడెయ్యడమే. ఆ తరవాత పోపు పెడితే చాలు. మామిడికాయ పప్పు రెడీ! అయితే, ఒరుగులో ఉప్పు కాస్త ఎక్కువ వుంటుంది గనక ఆవారా ఉప్పూ ఏ స్థాయిలో తగ్గించాలి. ఇంతకీ అసలు ఒరుగు అంటే ఏమిటీ? సీజన్‌లో పుష్కలంగా దొరికే కూరగాయల్ని జాగ్రత్తగా కడిగి, ఆరబెట్టి, తరిగి, పసుపూ వుప్పూ వేసి ఓ రోజు జాడీలో వుంచి, ఆ తరవాత సదరు ముక్కల్ని ఊరమిరపకాయల్లా ఎండబెట్టమే! అప్పుడప్పుడూ మళ్ళీ వాటిని ఎండబెట్టి 'వాసెన' కడితే, ఎన్నాళ్ళయినా ఒరుగులు చెడవు.

ఈ సోది అంతా ఎందుకంటే, మా అమ్మని పుట్టింట్లో దింపివచ్చాక కరణం మామ్మగారి దగ్గర నేను ఒరుగుపెట్టడం నేర్చుకున్నాను. వంగ ఒరుగు (వంకాయలు) బెండ ఒరుగు, మామిడి ఒరుగు మాత్రమేకాక, ఊరుమిర్చి, రేగివడియాలూ, పిండివడియాలూ కూడా పెట్టించింది మామ్మగారు. ఆవిడ చాలా నిపుణురాలు. ఒక్క క్షణం వృధాపోనీదు. దొడ్లో పత్తి మొక్కల నించి తీసిన పత్తితో వత్తులు చెయ్యడమే కాక నూలు వొడికి (రాట్నం మీద) జంధ్యాలు కూడా చేస్తుంది. జంధ్యాల పౌర్ణమిరోజున వాటిని ఉచితంగా బ్రాహ్మణులకి ఇస్తుంది. అన్ని గుళ్ళకీ ఉచితంగా కట్టలు కట్టలుగా వత్తులు ఇస్తుంది. 'అడ్డాకు'లతో అద్భుతంగా విస్తళ్ళు కుట్టివాటిని 50,100 చొప్పున కట్టలుగా కట్టి ఎవరింట్లో శుభకార్యం జరిగినా ఫ్రీగానే ఇస్తుంది. అదేమంటే, "చూడమ్మా.. ఇవన్నీ నాకు చేతనైన పనులు. పుణ్యం అనేది వుందో లేదో నాకు తెలీదు. కానీ 'మంచి' అనేది వున్నది కదా! ఖాళీగా కూర్చుని పోచుకోలు కబుర్లాడటం కంటే నాకు తోచినపని ఇష్టంగా చెయ్యడం మంచిదికదూ!" అన్నారు నవ్వి. ఆ క్షణం నాకు అర్ధమైంది. గురువులు అనేవారు. ఎక్కడో లేరనీ, మనలోనే, మనమధ్యే వుంటారనీ.

ఏ పని అయినా సరే, ఇష్టపడి చెయ్యడం వేరూ.. ఇష్టం లేకుండా ముక్కుతూ మూలుగుతూ చెయ్యడం వేరు. మా అమ్మ ఊళ్ళో లేని పదిరోజుల్లో కరణం మామ్మగారి దగ్గర ఒరుగులు పెట్టడం, విస్తళ్ళు కుట్టడమే కాక కొబ్బరి యీనెల చీపుళ్ళు కట్టడం కూడా నేర్చుకున్నా. రెండొందల విస్తళ్ళు కుట్టి యాభై యాభై చొప్పున అందంగా కట్టలు కట్టి పెట్టాను.

ఏదన్నా సరే, నేర్చుకోవాలనే తపనుంటే చాలు. ఎన్నయినా నేర్చుకోవచ్చు. నేర్చుకోవాలనే తపన వుంటే, నేర్పేవాళ్ళు కూడా మహా ఉత్సాహంగా నేర్పుతారు. మా రెండో సీత వాళ్ళ బామ్మదగ్గర నేర్చుకోనివన్నీ నేను చకచకా నేర్చుకున్నా. అప్పటికి వరకూ ఆవిడ్ని 'సిటీపోలీసూ' అంటూ వెక్కిరించిన నేను, ఆ తరువాత ఆమెకి ప్రియశిష్యురాలిగా మారడమేకాదు, ఆవిడకి నా హృదయంలో అత్యంత గౌరవప్రదమయిన స్తానాన్ని ఇచ్చాను. ఆమెకి ప్రియశిష్యురాలిగా మారడమే కాదు, ఆవిడకి నా హృదయంలో అత్యంత గౌరవప్రదమయినస్తానాన్ని ఇచ్చాను.

ప్రియనేస్తాల్లారా, నేను నేర్చుకున్న ప్రతిపనీ, ప్రతిపాఠం నా జీవితంలో ఎంతో ఉపయోగపడ్డాయి. ముఖ్యంగా ఓ విషయం చెప్పాలి. కరణం మామ్మగారు వేసిన పునాది నా జీవితాన్ని అద్భుతంగా మార్చింది. సమయపు విలువని నాకు చక్కగా నేర్పింది.

విస్తళ్ళు కుట్టడానికి చీపురు పుల్లల్ని చీల్చేటప్పుడు పలుచని వేళ్ళ చిగుళ్ళు కూడా తెగిమంటపుట్టాయి. అప్పుడు ఆవిడ నవ్వి, "ఈ పని చాలా సులువు అనిపిస్తుంది. కానీకాదు. ప్రతి పని వెనక ఓ 'నేర్పు' ఉంటుంది. ఆ 'నేర్పు' కావాలంటే అది పట్టుబడేంతవరకూ పట్టు విడవకుండా చేస్తూ వుండాలి" అన్నారు. అప్పుడు తెలిసింది.. నేను చాలా తేలిగ్గా తీసుకుని చీపురు పుల్లని చీల్చాను. జాగ్రత్త తీసుకోలేదు. అందుకే చివుళ్ళు తెగి రక్తం వచ్చింది. నెగ్లిజెన్స్ అనేది మనిషిలో వుండకూడదు. అది ఎంత చిన్న పని అయినా సరే. ఇదో గొప్పపాఠం ఆ తరవాత ఎన్నడూ నా వేళ్ళు చీరుకుపోలేదు. పదివిస్తళ్ళు కుట్టాక పట్టుదల పెరిగింది. ఒక్కోవిస్తరీ

మేటుపడుతున్న కొద్దీ మరింత ఉత్సాహం వచ్చింది. ఓ కట్ట (50) తయారు కాగానే అర్జంటుగా మరో కట్టని తయారు చెయ్యాలనే ఆత్రమూ ఉత్సాహమూ పెరిగిపోయాయి.

"ఈ విస్తళ్ళు.. నేను సృష్టించినవి" అనుకోగానే ఓ గర్వం, ఓ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ నాలో నిండిపోయాయి. మా నాన్నకి చూపించాను. నేను పెట్టిన ఒరుగుల్నీ, పిండి వొడియాలనీ, విస్తళ్ళనీ.

"నాకు తెలుసే సీతా.. నువ్వోగొప్ప 'మనిషి'వి అవుతావు. నీకో మాట చెప్పనా, మా అమ్మ కూడా నీలానే అన్ని పనుల్నీ నేర్చుకునేది" అంటూ ఠక్కున మౌనముద్రదాల్చాడు. ఏమీతెలీనట్టు నేను పక్కకి వెళ్ళిపోయాను. కానీ నాకు తెలుసు, మా నాన్నకి వాళ్ళమ్మని తలుచుకోగానే గొంతు గద్గదమై కళ్ళు చెమ్మగిల్లాయని. వయసు ఎంత పెరిగినా 'తల్లి' ఎప్పటికీ తల్లేకదూ. ఏ లోటునయినా యీలోకం భర్తీ చెయ్యగలదు, ఒక్క తల్లిలేని లోటుని తప్ప.

"బుద్దుందాలేదా? కొంపంతా ఏమిటీ విస్తళ్ళూ ఒరుగులూ. వెర్రెత్తిన ఎలుగ్గొడ్డులా కొంపంతా నానాచెత్తా పేర్చావు. నాల్రోజులు వదిలి వెళ్ళేసరికే నీకంత నెత్తిమీదకి కళ్ళొచ్చాయా?" లోపలికొస్తూనే అన్నిట్నీ చూసి చిందులు తొక్కింది మా అమ్మ. లక్కీగా మా నాన్న బజారుకెళ్ళాడు.

"ఎందుకూ చిందులు తొక్కడం? ముందు కాస్త కాఫీ కలిపిస్తాను. తాగాక ఏకంగా భరతనాట్యమే చెయ్యొచ్చు. అయినా పెదపాడు భాగ్యలక్ష్మీ, ఎదిగే ఆడపిల్లలకి కాస్త పనులూ గట్రా నేర్పాలని మీ అమ్మ నీకెప్పుడూ చెప్పలేదా? నువ్వు నేర్పించలేదు పో.. నా అంతట నేను నేర్చుకుంటే కూడా మెచ్చుకోవడంపోయి లోపాలు వెతుకుతావా..ఫో... యీ క్షణం నించీ నేను కేవలం మా నాన్న కూతుర్ని. అంతే!" గంభీరంగా అని లోపలికి పోయాను. మా అమ్మకి యీ మాత్రం 'డోసు' ఇచ్చి చాలాకాలమైంది. అదీగాక ఎప్పుడూ 'మంచిపిల్లగా' వుండాలంటే ఎంత కష్టం.. ఎంతబోరూ! అమ్మ రిక్షా దిగటం చూసిందనుకుంటా, కరణం మామ్మగారులోపలికొచ్చి, "ఏంటే భాగ్యం.. ఇప్పుడే వచ్చావా. నీ కూతురు భలేపిల్లే. వొడియాలూ ఒరుగులూ పెట్టడం ఎంత చక్కగా నేర్చుకుందో! నా ఎరికలో ఇప్పటిదాకా ఇట్టాంటి పిల్లని చూళ్ళేదనుకో!" అన్నది. ఓ పక్కన నేనన్నమాటలకి కోపం, ఇంకోపక్క మామ్మగారన్నమాటలకి ఆనందం.. రెండూ ఒకేసారి వస్తే ఎలా వుంటుందో అవ్వాళ చూశా. ప్చ్.. కెమేరా లేకపోవడం నా దురదృష్టం.. మా అమ్మ అదృష్టం. కోటికోసారి వచ్చే సందర్భం అది మరి! ఏం చేస్తాం!!!

*(మళ్ళీ కలుద్దాం)*

Post your comments